www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -293 మంగళవారం 7 జనవరి 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# రాష్ట్రాభివృద్ధికి సహకరించండి



- మోదీ ముందు చిట్టా విప్పిన రేవంత్...
- బందర్ పోర్ట్‌కు రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వాలి
- తెలంగాణ ఫార్మా ఇండస్ట్రీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉంది
- ఎలక్ట్రిక్ వేహికిల్ తయారీకి అనుమతి ఇవ్వాలి
- రీజనల్ రింగ్ రోడ్డు 374 కిలోమీటర్ల నిర్మాణం జరుగుతోంది
- రీజనల్ రైల్ అవసరం కూడా ఉంది

హైదరాబాద్ ప్రజావినికిడి:

చర్లపల్లి టెర్మినల్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా వర్చువల్‌గా చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొని ప్రసంగించారు. రైల్వే టెర్మినల్ పూర్తి చేసినందుకు ప్రధానికి తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. బందర్ పోర్ట్‌కు రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో డ్రైపోర్ట్ ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణ ఫార్మా ఇండస్ట్రీకి కేరాఫ్ అడ్రస్‌గా మిగతా 2లో...




## ఇప్పటికే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా హెచ్ఎంపీవీ..

- దేశంలో మూడు హెచ్ఎంపీవీ కేసులు నమోదు
- బాంబ్ పేల్చిన ఐసీఎంఆర్
- హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ ఇప్పటికే భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా 'సర్క్యులేషన్'లో ఉంది
- శ్వాసకోశ వ్యాధుల పెరుగుదలను ఎదుర్కొనేందుకు భారత్ సన్నద్ధంగా ఉంది
- వైరస్ వ్యాప్తి పరిస్థితిని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ



ఎయిర్‌పోర్టును తలపించేలా

## చర్లపల్లి రైల్వే స్టేషన్

- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఓఆర్ఆర్‌కు అత్యంత సమీపంలో చర్లపల్లి ఉంది
- తెలంగాణ ప్రగతిలో ఇది అత్యంత కీలకంగా మారబోతుంది
- సోలార్ స్టేషన్‌గా దీన్ని అభివృద్ధి చేశారు
- భారత రైల్వేలకు బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తున్నాం
- కోట్లాది మందిని వందేభారత్ రైళ్లు గమ్యం చేరుస్తున్నాయి

హైదరాబాద్ ప్రజావినికిడి:

సర్వ హంగులతో స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీతో అధునాతనంగా నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను సోమవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చ్యువల్‌గా - మిగతా3లో




## డాకింగ్ టెస్ట్‌ను వాయిదా వేసిన ఇస్రో

- మళ్లీ నిర్వహించేది ఎప్పుడో తెలుసా..?
- షెడ్యూల్ ప్రకారం డాకింగ్ ప్రక్రియ ఈ నెల 7న జరగాల్సి ఉండగా.. 9వ తేదీకి వాయిదా
- తొలిసారిగా డాకింగ్ టెస్ట్‌ను నిర్వహించనున్నది.
- భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ త్వరలో చంద్రయాన్-4 మిషన్‌కు సిద్ధమవుతుంది
- చంద్రుడిపై నమూనాలను సేకరించనున్నది

## కేటీఆర్‌పై కేసు పెడితే రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు

- అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు
- సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మరో 25 బస్సులను సంక్రాంతి లోపు, మిగతా వాటిని ఆ తర్వాత ప్రారంభిస్తాం



## తెలంగాణ ఓటర్లు.. 3.35 కోట్లు

- సవరించిన జాబితా వెల్లడించిన ఈసీ
- తెలంగాణలో కొత్త ఓటరు జాబితాను విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- సవరించిన ఓటరు జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- మొత్తం 3,35,27,925 మంది ఓటర్లు
- 1,66,41,489 మంది పురుష... 1,68,67,735 మంది మహిళా ఓటర్లు
- శేరిలింగంపల్లిలో అత్యధికంగా 7,65,982 మంది ఓటర్లు



హైదరాబాద్ ప్రజావినికిడి:

తెలంగాణకు సంబంధించి సవరించిన ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం.. రాష్ట్రంలో మొత్తం 3,35,27,925 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 1,66,41,489 మంది పురుష ఓటర్లు, 1,68,67,735 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. అదేవిధంగా మరో 2,829 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కూడా రాష్ట్రంలో ఉన్నారు. ఈ మొత్తం ఓటర్లలో 18 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న ఓటర్లు 5,45,026 మంది కాగా, 85 ఏళ్లు దాటిన వృద్ధ ఓటర్ల సంఖ్య 2,22,091 గా ఉన్నది. ఎన్ఆర్ఐ ఓటర్లు 3,591 మంది ఉన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులైన ఓటర్లు 5,26,993 మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఇక మిగతా 2లో...



## కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో ఎన్నికల బాండ్లు ఇచ్చింది

- గ్రీన్‌కో 2022లో ఎన్నికల బాండ్లు ఇచ్చింది
- 2023లో ఫార్ములా ఈ రేసు జరిగింది.
- కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో బాండ్లు ఇచ్చింది
- ఫార్ములా ఈ రేసు కారణంగా గ్రీన్ కో నష్టపోయింది
- అందుకే మరుసటి ఏడాది స్పాన్సర్‌షిఫ్ నుంచి తప్పుకుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ ప్రజావినికిడి:

గ్రీన్‌కో సంస్థ ద్వారా బీఆర్ఎస్ పార్టీకి రూ. కోట్ల లబ్ధి చేకూరినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గ్రీన్‌కో 2022లో మిగతా 2లో...

పేద, మధ్య తరగతి ప్రజలకు

# తీపికబురు!

- రేషన్ కార్డుకోసం దరఖాస్తుచేసుకున్న వారి వివరాలు పరిశీలించిన ప్రభుత్వం..
- వీరికి కొత్త రేషన్ కార్డులను జనవరి 26న అందించనుంది
- అర్హులు సైతం దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు
- ఈనెల15వ తేదీ నుంచి వారం రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించే అవకాశం
- రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులను ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేయాలనే ప్రణాళికను రూపొందించినట్లు సమాచారం



హైదరాబాద్ ప్రజావినికిడి:

పేద, మధ్య తరగతి ప్రజలు ఏవైనా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు పొందాలంటే ఇప్పటివరకు కొలబద్ధ రేషన్ కార్డు. అందుకే ప్రతి సామాన్య కుటుంబం రేషన్ కార్డు ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటారు. ప్రతినెలా తీసుకునే రేషన్ కంటే ప్రభుత్వం అందించే ఇతర సంక్షేమ పథకాలకు ప్రభుత్వాలు రేషన్‌కార్డు తప్పనిసరి నిబంధన పెట్టడంతో ఆ కార్డుకు ఎక్కువ డిమాండ్ ఉంది. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు వస్తాయని ప్రజలు ఎదురుచూసినా ఫలితం దక్కలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. కొత్త రేషన్ కార్డుల జారీకి మంత్రిమండలి ఇటీవల ఆమోదం తెలపడంతో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న జనంలో మళ్లీ ఆశలు మిగతా 2లో...



## ప్రెస్‌మీట్‌లో కంటతడి పెట్టిన ఢిల్లీ సీఎం

- రాజకీయాలు ఇంతగా దిగజారిపోవడంపై ఆవేదన
- చేసిన పనుల ఆధారంగా ఓట్లు అడగొచ్చు
- కానీ మా తండ్రిగారిని అవమానించడం సరికాదు"
- ఎలక్షన్ల కోసమని తన తండ్రిపై ఆయన (బిధూరి) బురద చల్లుతారా?

# ఎయిర్‌పోర్టును తలపించేలా చర్లపల్లి రైల్వే స్టేషన్

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టును తలపించేలా చర్లపల్లి రైల్వే స్టేషన్ నిర్మాణం జరిగిందని, రూ.413 కోట్ల వ్యయంతో చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఓఆర్ఆర్‌కు అత్యంత సమీపంలో చర్లపల్లి ఉందని, తెలంగాణ ప్రగతిలో ఇది అత్యంత కీలకంగా మారబోతోందని, సోలార్ స్టేషన్‌గా దీన్ని అభివృద్ధి చేశారని మోదీ వ్యాఖ్యానించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా.. చర్లపల్లి లాంటి స్టేషన్లు ఎంతో అవసరమని, 2014లో కేవలం 5 నగరాల్లోనే మెట్రో ఉందని, పదేళ్లలో 21 నగరాలకు మెట్రో విస్తరించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

భారత రైల్వేలకు బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తున్నామని, కోట్లాది మందిని వందేభారత్ రైళ్లు గమ్యం చేరుస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో 35 శాతం విద్యుదీకరణ పూర్తయిందని, వందేభారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు తెచ్చామని, హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతోందన్నారు. 180 కి.మీ. వేగంతో వందేభారత్ స్లీపర్ కోచ్ రైలు ట్రయల్ రన్ పూర్తి అయిందన్నారు. త్వరలోనే బుల్లెట్ రైలు సాకారం అవుతుందని, పదేళ్లలో 30 వేల కి.మీ. రైల్వే లైన్లు నిర్మించామని అన్నారు. నాలుగు విభాగాలుగా రైల్వేలను అభివృద్ధి చేస్తున్నామని, మౌలిక వసతులు, ప్రయాణికుల సదుపాయాలు, మూరుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ, ఉపాధి కల్పనే తమ లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్, ఒడిషా, తెలంగాణలో.. కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయని, రైల్వే ఆధునికీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో వర్చ్యువల్‌గా పాల్గొన్నారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పలువురు ప్రజా ప్రతి నిధులు హాజరయ్యారు.



సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది.

కాగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, వి.సోమన్న, రవనీత్ సింగ్, బండి సంజయ్, గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, తదితరులు హాజరయ్యారు. కాగా ఈ నెల7వ తేదీ నుంచి సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్- గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళ్లు (12603-12604) మార్చి 7 నుంచి,. గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.

# కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో ఎన్నికల బాండ్లు ఇచ్చింది

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల బాండ్లు ఇచ్చింది. 2023లో ఫార్ములా ఈ రేసు జరిగింది. కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో బాండ్లు ఇచ్చింది. ఫార్ములా ఈ రేసు కారణంగా గ్రీన్ కో నష్టపోయింది. అందుకే మరుసటి ఏడాది స్పాన్సర్‌షిఫ్ నుంచి తప్పుకుంది. అది క్విడ్ ప్రోకో ఎలా అవుతుంది..? ఇది రేవంత్ రెడ్డి టీం చేస్తున్న దుష్ప్రచారం. పార్లమెంట్ ఆమోదించిన ఎన్నికల బాండ్లు అవినీతి ఎలా అవుతుంది. దేశ వ్యాప్తంగా అన్ని పార్టీకు వచ్చిన బాండ్లపై చర్చకు సిద్ధం అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ నిర్వహించిన గ్రీన్‌కో సంస్థ ద్వారా బీఆర్ఎస్‌కు రూ. కోట్ల లబ్ధి చేకూరినట్లు ప్రభుత్వం పేర్కొంది. బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల బాండ్ల ద్వారా రూ. 41 కోట్లు చెల్లించినట్లు వెల్లడించింది. గ్రీన్‌కో, అనుబంధ సంస్థలు 26 సార్లు బాండ్లు కొన్నట్లు తెలిపింది. 2022లో ఏప్రిల్ 8 నుంచి అక్టోబర్ 10 మధ్య బాండ్లు కొన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఏప్రిల్ 8న 20 బాండ్లు, అక్టోబర్ 10న 6 బాండ్లు కొన్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.



ఫార్ములా-ఈ కారు రేసు కేసులో విచారణ నిమిత్తం కేటీఆర్ ఏసీబీ ఆఫీస్‌కు చేరుకున్నారు. అయితే న్యాయవాదులతో కలిసి విచారణకు రావడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏసీబీ ఆఫీస్ ప్రధాన గేటు వద్దే కేటీఆర్ కారును అడ్డుకున్నారు. దీంతో సుమారు 45 నిమిషాలపాటు అక్కడే వేచి ఉన్నారు. తనను అడ్వకేట్ల సమక్షంలోనే విచారించాలని పట్టుబట్టారు. పోలీసులు అనుమతించకపోవడంతో విచారణకు హాజరు కాకుండా అక్కడి నుంచి వెనుతిరిగారు. అయితే ఈ క్రమంలో తన లిఖితపూర్వక స్టేట్‌మెంట్‌ను ఏసీబీ డీఎస్పీకి అందించారు.

ఏసీబీ తనపై నమోదు చేసిన కేసులో తాను తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని అందులో ప్రస్తావించారు. అలాగే 'తనకు పంపిన నోటీసులు కేసుకు సంబంధించి తన నుంచి సమాచారంతోపాటు సంబంధిత పత్రాలను ఏసీబీ కోరింది. అయితే అవి ఎలాంటి పత్రాలో స్పష్టత ఇవ్వలేదు. అవి ఎలాంటి పత్రాలో స్పష్టత ఇచ్చి.. తనకు కొంత సమయం ఇవ్వాలని అందులో కోరారు. అదేవిధంగా రాజ్యాంగం, చట్టం తనకు కల్పించిన హక్కులను వినియోగించుకుంటూనే.. కేసు దర్యాప్తునకు హాజరై సహరిస్తానని తెలిపారు. అయితే హైకోర్టులో తాను వేసిన క్వాష్ పిటిషన్ తీర్పు రిజర్వులో ఉందని, తీర్పు వచ్చేదాకా తనకు గడువు ఇచ్చే అవకాశం పరిశీలించాలని' ఏసీబీ డీఎస్పీ మజిద్ ఖాన్‌ని కోరారు.

# ఒక్క విద్యార్థి కూడా లేని 2097 పాఠశాలలు

**హైదరాబాద్ :** దేశంలో విద్యా వ్యవస్థ రోజు రోజుకు మరింత దిగజారిపోతున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడీఐఎస్ఈ) ప్లస్ ఒక నివేదిక రిలీజ్ చేసింది. అందులో ఆసక్తి గొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. ఒక వైపు వసతి గృహాలు, మరో వైపు గురుకులాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యా విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్తున్న అధికారులకు సాధారణ పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. గురుకులాల కోసం కార్పొరేట్ స్థాయిలో భవనాలను నిర్మించి పేద, మధ్య తరగతి పిల్లలకు విద్య అందిస్తోంది. ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థను మారుస్తామని చెప్తున్న ప్రభుత్వాధికారులకు కొన్ని పాఠశాలలు తలనొప్పిగా మారాయి. తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల విద్య మరింత దిగజారుతుందనేందుకు నిదర్శనంగా 2,000 పాఠశాలల్లో విద్యార్థులు లేరని ఖాళీ తరగతి గదులు మాత్రమే ఉన్నాయని విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక చెప్తోంది. 2023-24కి సంబంధించిన జఆమొఇ ప్లస్ నివేదిక ప్రకారం.. మొత్తం 2,097 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేదని పేర్కొంది. ఇది రాష్ట్రంలో పాఠశాల విద్య పరిస్థితిని హైలైట్ చేస్తుంది. పశ్చిమ బెంగాల్ 3,254, రాజస్తాన్ 2,167 పాఠశాలల తర్వాత జీరో ఎన్‌రోల్‌మెంట్‌లతో అధిక సంఖ్యలో పాఠశాలలతో తెలంగాణ దేశంలోనే మూడో రాష్ట్రంగా నిలిచింది. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్నప్పటికీ, పాఠశాలల్లో 2,000 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. మొత్తం 88,429 మంది విద్యార్థులతో 5,985 పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడని వెలుగులోకి వచ్చిన మరో ఆశ్చర్యకరమైన సమాచారం. 2023-24 విద్యా సంవత్సరంలో అన్ని మేనేజ్‌మెంట్ల కింద మొత్తం 72,93,644 మంది విద్యార్థులు, 3,41,460 మంది టీచర్లతో రాష్ట్రం 42,901 పాఠశాలలకు నిలయంగా మారింది. ఇంకా, ప్రభుత్వ పాఠశాలల్లో 2021-22లో 33,03,699 నుంచి 2022-23లో 30,09,212కి 2023-24 విద్యా సంవత్సరంలో 27,79,713కి తగ్గింది. రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాల స్థాయి వరకు సున్నా డ్రాపౌట్ రేటు నమోదైంది. అయినప్పటికీ సెకండరీ స్థాయిలో 13.3 శాతం బాలురు, 9.5 శాతం బాలికలు పాఠశాలకు రావడం మానివేయడంతో డ్రాపౌట్ రేటు 11.4 శాతానికి పెరిగింది. పై స్థాయికి వెళ్లేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఇంకా, 42,901 పాఠశాలల్లో 11.8 శాతం 10 కంటే తక్కువ విద్యార్థుల నమోదు చేసింది కేవలం 8.7 శాతం పాఠశాలల్లో మాత్రమే 500 కంటే ఎక్కువ మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. బాలికలు, బాలురకు మరుగుదొడ్లు లేని పాఠశాలల గురించి కూడా నివేదిక పేర్కొంది. 29,383 బాలికల పాఠశాలల్లో 2,017 మరుగుదొడ్లు లేవని, మిగిలిన వాటిలో 2,277 మరుగుదొడ్లు పనిచేయడం లేదని, బాలుర విషయానికొస్తే 28,689 పాఠశాలల్లో 4,823 పాఠశాలల్లో మరుగుదొడ్లు లేవని, 2,618 పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్నాయని తెలిపింది.




## గురుకుల విద్యార్థి శైలజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : ఎమ్మెల్సీ కవిత

**ఆసిఫాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వాంకిడీ ఆశ్రమ పాఠశాలలో విషాహారం తిని మృతిచెందిన బాలిక శైలజ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. శైలజ చిత్రపటానికి కవిత పూలమాల వేసి నివాళు లర్పించారు. గతంలో నిమ్స్ ఆస్పత్రిలో శైలజ చికిత్స పొందే క్రమంలో ఎమ్మెల్సీ కవిత పరామర్శించిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ శైలజ మరణించిన విషయం తెలిసి చలించిన ఎమ్మెల్సీ కవిత %ౌ% ఆ కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించారు. దాంతో అప్పుడు ప్రకటించిన రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని స్వయంగా బాలిక నివాసానికి వెళ్లి అందించారు. శైలజ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మీ, అనిల్ జాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



## పేద, మధ్య తరగతి ప్రజలకు తీపికబురు!

-మొదటిపేజీ తరువాయి

చిగురించాయి. అయితే ఈ రేషన్ కార్డు కోసం ఏమి చేయాలి, ఎలా పొందాలనే అనుమానాలు చాలామందికి ఉండొచ్చు. జనవరి 26వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులు జారీచేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ క్రమంలో కొత్త కార్డు పొందాలంటే ఏమి చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తులు**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ దరఖాస్తుతోనే రేషన్ కార్డులు లేనివారు తమ వివరాలను పొందుపర్చారు. రేషన్ కార్డుకోసం దరఖాస్తుచేసుకున్న వారి వివరాలు పరిశీలించిన ప్రభుత్వం.. అర్హులను గుర్తించినట్లు తెలుస్తోంది. వీరికి కొత్త రేషన్ కార్డులను జనవరి 26న అందించనుంది. అదే విధంగా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులు సైతం దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించనుంది. ఈనెల15వ తేదీ నుంచి వారం రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో అర్హులను గుర్తించి కొత్త రేషన్ కార్డులను జారీ చేయనుంది. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు సమర్పిస్తే ఈనెలలోనే కొత్తకార్డులు ఇంటికి రానున్నాయి.

**రేషన్ కార్డులతో లింక్..**

ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డుతో లింక్ పెట్టిన తెలంగాణ ప్రభుత్వం.. ఇక నుంచి ఆ విధానంలో మార్పులు తీసుకువచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులను ప్రభుత్వ పథకాలకు ఎంపిక చేయాలనే ప్రణాళికను రూపొందించినట్లు సమాచారం. రేషన్ కార్డుతో ప్రభుత్వ పథకాలను ముడిపెట్టడం ద్వారా అనర్హులు సైతం రేషన్ కార్డులు పొందుతుండటంతో ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణ ఓటర్ల సంఖ్య 3.35 కోట్లు..

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకుగాను శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 7,65,982 మంది, భద్రాచలంలో అత్యల్పంగా 1,54,134 మంది ఓటర్లు ఉన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

-మొదటిపేజీ తరువాయి

ఉందన్నారు. ఎలక్ట్రిక్ వేహికిల్ తయారీకి అనుమతి ఇవ్వాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు 374 కిలోమీటర్ల నిర్మాణం జరుగుతోందని.. రీజనల్ రైల్ అవసరం కూడా ఉందన్నారు. రైల్ రింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. వికారాబాద్ నుంచి కొడంగల్ మీదుగా కర్ణాటకకు రైల్వే లైన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రధాని కోరుకుంటున్న 5 ట్రిలియన్ ఎకానమీ సకారం కావాలంటే అన్ని రాష్ట్రాల అభివృద్ధి జరగాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటుందన్నారు. డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తే రాష్ట్రాభివృద్ధికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. 1 ట్రిలియన్ ఎకానమి కాంట్రిబ్యూట్ చేసేందుకు తమకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని ప్రధాన మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కాగా.. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. అలాగే జనవరి 7 నుంచి సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్-గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళు (12603-12604) మార్చి 7 నుంచి,. గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.

## కేటీఆర్‌పై కేసు పెడితే రౌడీళ్లా ప్రవర్తిస్తున్నారు



వరంగల్: ఓరుగల్లును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలో భద్రకాళి ట్యాంక్ బండ్, టెక్స్ టైల్ పార్క్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి వెల్లడించారు. వరంగల్ రీజియన్‌కు తెలంగాణ ఆర్టీసీ కేటాయించిన 112 ఎలక్ట్రిక్ బస్సుల్లో ఇవాళ(సోమవారం) 50 బస్సులను మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ప్రారంభించారు. హనుమకొండ బాలసముద్రం హయగ్రీవాచారి గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి బస్సులను ప్రారంభించారు. మరో 25 బస్సులను సంక్రాంతి లోపు, మిగతా వాటిని ఆ తర్వాత ప్రారంభిస్తామని పొంగులేటి తెలిపారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముగ్గురు మంత్రులూ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. "పర్యావరణానికి హాని కలగకుండా తెలంగాణ ఆర్టీసీని అప్డేట్ చేస్తున్నాం. అందుకే ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్‌కు ఏ టెక్నాలజీ వచ్చినా వెంటనే దాన్ని వరంగల్‌కూ తెస్తాం. ఉమ్మడి ఏపీలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. 4.5 లక్షల గృహాలను ఇప్పుడు మొదటి విడతలో ఇస్తాం. రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టిస్తాం. అన్ని మండలాల్లో మోడల్ ఇందిరమ్మ గృహాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం. సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు శాంక్షన్ చేస్తాం. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని పంపించాం. 80 లక్షల మంది ఇందిరమ్మ గృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని స్క్రూటినీ చేసి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా లబ్ధిదారులకు అందిస్తాం. దరఖాస్తు చేసుకోని వారు భయపడాల్సిన పనిలేదు. ఇందిరమ్మ గృహాలు అనేది నిరంతర ప్రక్రియ, అర్హులకు తప్పకుండా ఇస్తాం. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి అందిస్తాం. రైతు భరోసాపై వేలాది మంది రైతుల అభిప్రాయాలను సేకరించిన తర్వాతే నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎకరానికి రూ.12 వేలు చొప్పున రైతు భరోసా కింద ఇవ్వాలని నిర్ణయించాం. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తాం. జనవరి 26 నుంచి రైతు భరోసా, రేషన్ కార్డులు అందిస్తాం. భూమిలేని అర్హులైన పేదలకు ఏటా రూ.12వేలు ఇస్తాం. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఒకవేళ 200 ఎకరాలు సాగు చేస్తే ఆయనకూ రైతు భరోసా ఇస్తాం. 25 లక్షల మంది అన్నదాతలకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం. సన్న వడ్లు పండించిన రైతన్నలకు రూ.500 బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం పదేళ్లలో మర్చిపోయిన రేషన్ కార్డులను మేము ఇవ్వబోతున్నాం. ప్రజలు ఇందిరమ్మ రాజ్యంలో ఏం కోరుకున్నారో అవన్నీ నెరవేరుతాయి. పేదోడి సొమ్ము విదేశాలకు పంపించిన అక్రమార్కుడిపై చట్టప్రకారం కేసులు పెడితే ప్రతిపక్షాలు రౌడీళ్లా ప్రవర్తిస్తున్నాయి. ప్రతిపక్షాల చిల్లర మాటలకు మా అభివృద్ధి పనులే సమాధానం చెప్తాయని" అన్నారు.





# అక్రమ షెడ్ల ను ప్రోత్సహిస్తున్న డిసీ..

## మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాధ్యతారహిత్యం..

- టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి దందా..మామూళ్ల రాజ్యం..
- మల్కాజిగిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అంటేనే అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మార్చారా.?
- అక్రమ సంపాదన కోసం ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి అంతా ఇంతా కాదు..
- న్యాక్ ఇంజనీర్లు,చైన్ మెన్ ల వసూల్ దందా ప్రతినెల లక్షలలోనేనా.?



ప్రజావినికిడి,(మల్కాజిగిరి):

మల్కాజిగిరి టౌన్ ప్లాన్ విభాగంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. మల్కాజిగిరి సర్కిల్ అంటేనే చాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్ మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇన్ని అవినీతి అక్రమాలు జరిగిన డిప్యూటీ కమిషనర్ రాజు తనకు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం వెనక తనకు కావలసిన వాటాలు అందుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అందుకోసమే ప్రజా సమస్యలపై అవినీతి అక్రమాలపై డిప్యూటీ కమిషనర్ ఎలాంటి చర్యలు తీర్చుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.ఈయన అవినీతికి ఉన్నత అధికారులు కూడా తోడు కావడంతో ఎలాంటి శాఖ పరమైన చర్యలు తీసుకోకపోవడం వలన డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్యంతో మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో జోరుగా అక్రమ షెడ్లు, అక్రమ భావన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి అధికారుల జేబులు అవినీతి సొమ్ముతో నిండుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి దందా..

మల్కాజిగిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎప్పుడు అవినీతి దందా జోరుగా సాగుతూనే ఉంటుంది.ఏసీపీలు మారిన పరిస్థితి మాత్రం అలాగే కొనసాగుతుంది. కొత్తగా వచ్చిన ఏసీపి లకు సైతం అవినీతి మరకలు అంటుతున్నాయి వాళ్లు సైతం అవినీతి అక్రమాలను పోషిస్తూ అందిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు. వీళ్లకు తగ్గట్టుగానే న్యాక్ ఇంజనీర్లు,చైన్ మెన్లు అవినీతికి పూర్తిగా సహకరిస్తూ వసూలు చేసి మరి అధికారులకు ఇవ్వడం ఇక్కడ సర్వ సాధారణంగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో అక్రమ షెడ్లు జోరుగా సాగుతున్నాయని ఒక్కొక్క షెడ్ నుండి దాదాపు టౌన్ ప్లానింగ్ అధికారులకు,సర్కిల్ అధికారులకు లక్షలలో అందాయని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. అందుకోసమే ఫిర్యాదులు చేసిన, పత్రికలో కథనాలు వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతి అక్రమాలకు చెక్ పెట్టడం ఎవరి తరం కావడం లేదని సాక్షాత్ జిహెచ్ఎంసి కమిషనర్ సైతం మల్కాజిగిరి సర్కిల్ పై దృష్టి సారించకపోవడంతో ఇక అవినీతి అక్రమాలకు అడ్డు లేకుండా పోయిందన్న ఆరోపణలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైన ఉన్నత అధికారులు చర్యలు తీసుకుంటారో లేక సర్కిల్ నుండి ప్రతినెల మాకింత కావాలని మాటలు పంచుకుంటారో వేచి చూడాలి.

## గౌతమ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు.



ప్రజావినికిడి,(అంబర్ పేట్):

హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్.గౌతమ్ రావు పుట్టిన రోజు సందర్భంగా బిజెపి నేతలు గౌతమ్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలో బీజేపీ బలోపేతం కావడం కోసం గౌతమ్ రావు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ కార్పోరేటర్లు అమృత, ఉమా రమేష్ యాదవ్, నేతలు ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వీర్ లోధేశ్వర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ - వీర్ బజరంగ్ కేసరి 2025 కుస్తీ పోటీలు



ప్రజావినికిడి, (హైదరాబాద్) : వీర్ బజరంగ్ కేసరి 2025 వీర్ లోధేశ్వర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో ఫైనల్ కుస్తీ పోటీలను హైదరాబాద్ ధూల్ పేట్ మిని స్టేడియంలో నిర్వహించారు. ఫైనల్‌లో వీర్ బజరంగ్ కేసరి 2025 ఛాంపియన్ షిప్‌ను సుస్మిత్ సింగ్ కైవసం చేసుకున్నారు. జూనియర్ విభాగంలో బాల కేసరి 2025 టైటిల్ ను అరవింద్ గెలుపొందారు. ఈ సందర్భంగా వీర్ లోధేశ్వర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ వ్యవస్థాపక అధ్యక్షులు హెచ్.పెర్వేష్ సింగ్ మాట్లాడుతూ ఈ కుస్తీ పోటీలను నాన్నగారి జ్ఞాపకార్థంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. నేటి యువకులు డ్రగ్స్ మత్తు బారిన పడకుండా, చెడు దారిలో వెళ్లకుండా క్రీడల వైపు మొగ్గ చూపాలని ఇలాంటి పోటీలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమానికి తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. కుస్తీ పోటీలలో రెజ్లింగ్ చాంపియన్ షిప్ సీనియర్ వస్తాదులు వచ్చేసి పోటీలో పాల్గొన్న నవ యువకులను ఆశీర్వదించి ప్రారంభించారు. బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ రావ్ ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన వారికి శాలువాతో సత్కరించి సర్టిఫికెట్, మెమెంటోలను అందజేశారు. బజరంగ్‌సేన కార్యదర్శి, సలహాదారులు, సభ్యులు వినయ్ తివారీ,సురేందర్ సురానా జీ, ప్రముఖులు అభినయ్ తివారీ, ప్రభుజీ, రవి, శైలేందర్ సింగ్, ప్రవీణ్ యాదవ్, నరేష్, రామేశ్వర్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## హయత్ నగర్ పద్మశాలి సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్):జనవరి 6,: హయత్ నగర్ పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని హయత్ నగర్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమానికి హయత్ నగర్ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు వడ్డేపల్లి లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు పన్నం నరేందర్ నేత మాట్లాడుతూ పద్మశాలీయులందరు సంఘటితమై సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. హయత్ నగర్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పద్మశాలీయులు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని వారిని ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వం పైన ఎంతైనా ఉందని వారు సూచించారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు వారి ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బడుగు హరినాథ్,తలాటి రమేష్,సంఘం రమేష్,విశ్వరాజ్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# ప్రజా పాలన దరఖాస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు గల్లంతు..

## బుద్దుల జంగయ్య

### ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన సమస్యలపై కొందుర్గు ఎంపీడీవో విన్నతి పత్రం అందజేత..

ప్రజావినికిడి,(కొందుర్గు):
కొందుర్గు మండల పరిధిలో అన్ని గ్రామాలలో ఒక్కొక్క ఊళ్లో ఐదు నుంచి పది ఇందిరమ్మ ఇండ్ల ప్రజా పాలన దరఖాస్తులు ఆన్లైన్ చేయక గల్లంతయినట్టు అందుమూలంగా నిజమైన అర్హులైన పేదల పేర్లు ఆన్లైన్లో లేకపోవడం వలన గ్రామాలలో ఇంద్రమ్మ ఇండ్ల సర్వేల సందర్భంగా ఫోటోలు దింపడం లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొందుర్గు మండల ఇన్చార్జ్ బుద్దుల జంగయ్య నేడు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తులు అటహాసంగా తీసుకున్న పాలక ప్రభుత్వం దరఖాస్తుల్లో రాసె సందర్భంగా ఆన్లైన్ చేసే సందర్భంగా పేదల



దరఖాస్తులను మిస్ చేయడం జరిగిందని ఆ మూలంగా నిజమైన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు చాలామంది లబ్ధిదారులకు గ్యాస్ డబ్బులు రావడం లేదు కరెంటు బిల్లు సబ్సిడీ రావడం లేదు ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కూడా దరఖాస్తుల మిస్సింగ్ వల్ల ఫోటోలు దింపడం లేదని దీనికి కారణం ఎవరని ప్రభుత్వం అధికారులు కాదని ఆయన ప్రశ్నించారు వందలాది నిజమైన లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారని దానికి ప్రభుత్వం అధికారులు సమాధానం చెప్పాలని ఆయన మండి పడ్డారు అధికారులు మిస్సయిన లబ్ధిదారుల దరఖాస్తులను తిరిగి స్వీకరించి ఆన్లైన్ చేయాలని ఫోటోలు దింపాలని ఆయన డిమాండ్ చేశారు లేనియెడల మండల వ్యాప్తంగా లబ్ధిదారులందరినీ కూడా ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని దానికి అధికారులు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన విన్నత్ పత్రాన్ని ఎంపీడీవో కుఇవ్వడం జరిగింది ఎంపీడీవో మాట్లాడుతూ, ఈ సమస్య మా దృష్టిలో ఉందని మండల వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారుల పేర్లు సేకరించి కలెక్టర్ కు పంపించి సమస్య పరిష్కారమయ్యే విధంగా ప్రయత్నిస్తానని తెలిపారు కార్యక్రమంలో సిపిఐ కొందుర్గు మండల కార్యదర్శి బాగళ్ల నరసింహ ఏఐటీయూసీమండల కార్యదర్శి సి సురేష్ లబ్ధిదారులు లక్ష్మయ్య రాములు సునీత నక్క జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల నిర్మాణానికి ప్రముఖ వ్యాపార వేత్త పూర్ణచందర్ రూ. 5 లక్షల విరాళం..



ప్రజావినికిడి,(షాద్ నగర్):
షాద్ నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం ముందుకు వస్తున్న దాతలకు షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నాడు ప్రముఖ వ్యాపారవేత్త పూర్ణచందర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు టి.కాశీనాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతులమీదుగా 5 లక్షల రూపాయలు విరాళం అందజేశారు. కళాశాల పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా కళాశాల నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

# ట్రాఫిక్ అవేర్నెస్ తో ప్రాణాలను కాపాడొచ్చు

## - రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### - హనుమకొండలో ట్రాఫిక్ అవేర్నెస్ చిల్డ్రన్ పార్క్ కు శంకుస్థాపన చేసిన మంత్రులు

హనుమకొండ/జనవరి,ప్రజావినికిడి,:
ట్రాఫిక్ అవగాహన గురించి ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలని, ట్రాఫిక్ అవేర్నెస్ తో మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చునని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హనుమకొండ అశోక కూడలి సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో ట్రాఫిక్ అవగాహనపై చిల్డ్రన్ పార్కుకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత ఉత్సవాలు గతంలో వారం రోజుల పాటు మాత్రమే ఉండేవని, ఇప్పుడు నెలరోజులపాటు రోడ్డు భద్రత ఉత్సవాలను నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రోడ్డు భద్రత పట్ల నెలరోజులపాటు పోలీస్, విద్యా, రవాణా, ఆర్ అండ్ బి, అగ్నిమాపక శాఖల సమన్వయంతో రోడ్డు భద్రత సంబంధించిన వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు రోడ్డు ప్రమాదాల కారణంగా 20 మంది వరకు మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా ప్రాంతాల్లో రోడ్డు భద్రతకు సంబంధించి వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు యూనిసెఫ్





మార్గదర్శకాల మేరకు ప్రతి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్నెస్ పార్కులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నెలరోజులపాటు ట్రాఫిక్ అవేర్నెస్ కల్పిస్తూ రోడ్డు భద్రత కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరిలో మార్పు రావాలని, లేదంటే చట్టం అమలు చేయడం ద్వారా మార్పు జరుగుతుందన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించినట్లయితే లైసెన్సులను రద్దు చేయడంతో పాటు కఠిన శిక్షలను అమలు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకురాబోతుందన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వాహనదారు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలలో 20 మంది పైచిలుకు చనిపోవడమే కాకుండా అంగవైకల్యం బారిన పడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు సంపాదనపై ఆలోచనతో నిత్యం ఆరాట పడుతూ పరధ్యానం, నిర్లక్ష్య డ్రైవింగ్ తో ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు ఉదాహరణగా ఖమ్మం జిల్లా వైరాలో జరిగిన ఘటనను వివరిస్తూ.. ఒక తండ్రి తన ఇద్దరు పిల్లలను ద్విచక్ర వాహనంపై పాఠశాల నుండి ఇంటికి తీసుకు వెళ్తున్న క్రమంలో మొబైల్ ఫోన్ మాట్లాడుతూ ఆగి ఉన్న కారును డీకొట్టగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకు మరణించారని, వారి కూతురు ప్రమాదం కారణంగా మంచానికే పరిమితమై తీరని విషాదం ఆ కుటుంబంలో నెలకొందని అన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన ఏ ఒక్కరు కూడా పడొద్దని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. ఇంటికి వెళ్ళాక రోడ్డు భద్రత సంబంధించిన అంశాలను కుటుంబ సభ్యులకు వివరించాలని సూచించారు. నెల రోజులపాటు రోడ్డు భద్రత నియమావళికి సంబంధించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు చాలా బాగున్నాయని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వాటి ద్వారా చాటి చెప్పారని అన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చునని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ద్వారా చాలామంది వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని కోరారు. ట్రిపుల్ రైడింగ్ చేయకుండా చూసుకోవాలన్నారు. ప్రమాదాల కారణంగా మరణించిన వారి కుటుంబాల్లో తీరని విషాదం అలుముకుంటుందని పేర్కొన్నారు. ప్రతి వాహనం వెనకాల రేడియం స్టిక్కర్ ను వేసుకున్నట్లయితే వెనకాల వచ్చే వాహనదారులకు ముందు వెళ్లే వాహనం కనిపిస్తుందన్నారు. రవాణా శాఖ వారు ప్రతి వాహనానికి రేడియం స్టిక్కర్ ఉండే విధంగా చూడాలన్నారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు మన ప్రాణమే కాకుండా ఎదుటివారి ప్రాణాలను కూడా ఆలోచించి డ్రైవింగ్ చేయాలన్నారు. రవాణా, అగ్నిమాపక, పోలీస్ శాఖల వారు ఎన్ సిసి కేడేట్ల సేవలను వినియోగించుకుని రోడ్డు భద్రతకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతయాన్నారు. ఈ నెల రోజులు రవాణా శాఖ సహకారంతో రోడ్డు భద్రత మాసోత్సవాలను విజయవంతంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, ఇతర అధికారులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో షేక్ హ్యాండ్స్ వద్దు

## : రేవంత్ సర్కార్ హైఅలర్ట్: మార్గదర్శకాలు..

ప్రజావినికిడి,(హైదరాబాద్):
చైనాలో మెటాన్యుమోవైరస్ (%HMPV%) శరవేగంగా విస్తోరిస్తోన్న ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలు చేపట్టింది. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా శరవేగంగా నిర్ణయాలను తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ప్రజారోగ్యం- కటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ బీ రవీందర్ నాయక్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క హెచ్ఎంపీవీ కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. దీని బారిన పడకుండా ఉండటానికి పలు సూచనలు ఇచ్చారు. హెచ్ఎంపీవీ మరో రెస్పిరేటరీ వైరస్ అని, చలికాలంలో జలుబు, ఫ్లూ తరహా లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. ప్రత్యేకించి- చిన్నపిల్లలు, వయోధిక వృద్ధులు దీని బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు కొన్ని సూచనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని కోరారు. చేయాల్సినవి- చేయకూడని వివరాలను ఈ ప్రకటనలో పొందుపరిచారు.



### చేయాల్సినవి..

1. దగ్గు, తుమ్ముతున్నప్పుడు నోటికి లేదా ముక్కుకు హ్యాండ్ కర్చీఫ్ లేదా టిష్యూ పేపర్ను అడ్డు పెట్టుకోవాలి.
2. సబ్బు లేదా అల్కహాల్తో కూడిన శానిటైజర్తో తరచూ చేతులను శుభ్రపర్చుకోవాలి.
3. గుంపుగా ఉండే ప్రదేశాలకు వెళ్లకూడదు. అలాంటి ప్రదేశాలకు వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్లూతో బాధపడుతున్న వారికి దూరంగా ఉండాలి.
4. జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నప్పుడు బహిరంగ ప్రదేశాలకు వెళ్లకూడదు. గుంపులో తిరగకూడదు.
5. చాలినంత మంచినీళ్లు తీసుకోవాలి. పౌష్టికాహారాన్ని స్వీకరించాలి.
6. అనారోగ్యం బారిన పడినప్పుడు ఇతరులను కలుసుకోవడాన్ని తగ్గించాలి. ఇంట్లోనే ఉండాలి.
7. గాలి ధారాళంగా వచ్చేలా చేసుకోవాలి.
8. కంటి నిండా నిద్రపోవాలి.

### చేయకూడనివి..

1. ఇతరులకు షేక్ హ్యాండ్స్ ఇవ్వకూడదు.
2. ఒకసారి వినియోగించిన టిష్యూ పేపర్లు, హ్యాండ్ కర్చీఫ్ను మళ్లీ వాడకూడదు.
3. అనారోగ్యంతో బాధపడుతున్న వారితో దూరంగా ఉండాలి.
4. తరచూ కంటిని నలుపుకోవడం, ముక్కు, నోటిని చేత్తో తుడుచుకోవడాన్ని మానుకోవాలి.
5. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయకూడదు.
6. డాక్టర్ను సంప్రదించకుండా సొంతంగా ఎలాంటి మెడిసిన్నూ వాడకూడదు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





# ట్రోల్స్‌తో డిప్రెషన్స్‌లోకి వెళ్లిపోయా

ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్న భామల్లో ఒకరు మీనాక్షి చౌదరి. ఈ బ్యూటీ గతేడాది దళపతి విజయ్‌తో ది గోట్ సినిమాలో మెరిసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత లక్కీ భాస్కర్‌తో బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది. అయితే ది గోట్ సినిమా ఈ బ్యూటీ మాత్రం ఆశించిన స్థాయిలో బ్రేక్ ఇవ్వలేకపోయింది. త్వరలోనే అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా రాబోతున్న సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకులకు హాయ్ చెప్పనుంది. ఈ సినిమా జనవరి 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి తన లైఫ్‌లో ఎదుర్కొన్న కష్టతరమైన విషయాన్ని ఒకటి షేర్ చేసుకుంది. విజయ్‌తో కలిసి నటించిన ది గోట్ సినిమా విడుదలయ్యాక నా నటనపై ఆన్‌లైన్‌లో చాలా ట్రోల్స్ వచ్చాయి. ఈ ట్రోల్స్‌తో వారంపాటు నేను డిప్రెషన్‌లోకి వెళ్లేలా చేశాయంటూ చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మీనాక్షి చౌదరి మరోవైపు జాతిరత్నాలు హీరో నవీన్ పొలిశెట్టితో కలిసి అనగనగా ఒక రాజు సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇటీవలే ఈ మూవీ నుంచి విడుదల చేసిన వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



# పార్వతీదేవిగా కాజల్

మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. విష్ణు సరసన ప్రీతి ముకుందన్ కథానాయికగా నటిస్తుంది. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు మోహన్ లాల్, శరత్ కుమార్ తదితర ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా స్టార్ బ్యూటీ కాజల్ అగర్వాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ శివుడి భార్య పార్వతి దేవిగా కనిపించబోతుంది. "ముల్లోకాలు ఏలే తల్లి ! భక్తుల్ని ఆదుకునే త్రిశక్తి ! శ్రీ కాళ హస్తిలో వెలసిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక !" అంటూ ఫస్ట్ లుక్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమాలో పరమశివుడి పాత్రలో అక్షయ్ కుమార్ నటిస్తుండగా.. పార్వతి పాత్రలో కాజల్ నటిస్తున్నట్లు వెల్లడించింది.



# మణిరత్నం సినిమాకు బాలకృష్ణ కూతురు నో

టాలీవుడ్ సీనియర్ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం డాకు మహరాజ్. ఈ సినిమాకు బాబీ దర్శకత్వం వహిస్తుండగా.. అగ్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ చిత్రం జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా బాలకృష్ణ హోస్ట్ చేస్తున్న 'అన్‌స్టాపబుల్' షోకి డాకు మహరాజ్ టీం నుంచి దర్శకుడు బాబీ నిర్మాత వంశీ, మ్యూజిక్ డైరెక్టర్ థమన్ వచ్చి సందడి చేశారు. అయితే ఈ షోలో థమన్ అడిగిన పలు ప్రశ్నలకు బాలయ్య సమాధానమిచ్చారు. 'మీ ఇద్దరి అమ్మాయిల్లో ఎవరిని గారాబంగా పెంచారు?' అని థమన్ బాలయ్యని అడుగగా.. బాలయ్యా సమాధానమిస్తూ.. నా ఇద్దరు కూతుళ్లు బ్రాహ్మణి, తేజస్వినిలను తాను గారాబంగా పెంచానని అయితే తాను బ్రాహ్మణికి ఎక్కువగా భయపడతానని తెలిపారు. అయితే బ్రాహ్మణికి మణిరత్నం నుంచి ఒక సినిమా ఆఫర్ కూడా వచ్చిందని ఆయన తెలిపాడు. అయితే మణిరత్నం ఇచ్చిన ఆఫర్‌ని బ్రాహ్మణి రిజెక్ట్ చేసిందని చెప్పుకోచ్చారు. తనకు సినిమాలంటే అసలు ఆసక్తి లేదని అందుకే నో చెప్పిందని తెలిపాడు. అయితే నా చిన్న కూతురు తేజస్విని అయిన హీరోయిన్‌గా రాణిస్తుందని అనుకున్నాను కానీ ఆమె కేవలం అద్దంలో చూసుకుంటూ నటించేదని చెప్పుకోచ్చాడు బాలయ్య. ఇక నా తర్వాత సినిమాలలో మెగాస్టార్ చిరంజీవి అంటే బ్రాహ్మణికి చాలా ఇష్టమని బాలయ్య చెప్పుకోచ్చాడు.

# హన్సిక పై గృహహింస కేసు..

## పెట్టింది ఎవరో తెలిస్తే షాక్ అవ్వాల్సిందే..



అందాల భామ హన్సిక ఊహించని చిక్కుల్లో పడింది, ఆమె పై గృహహింస కేసు నమోదైంది. హన్సిక సోదరుడు ప్రశాంత్ భార్య ముస్కాన్ పెట్టిన గృహ హింస కేసు చర్చనీయాంశంగా మారింది. హన్సికతో పాటు ఆమె ఫ్యామిలీ మొత్తం మీద కేసు పెట్టింది ముస్కాన్. హన్సిక సోదరుడు ప్రశాంత్, ముస్కాన్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ ఇద్దరు 2021లో పెళ్లి పీటలు ఎక్కారు. అయితే ఇప్పుడు ఈ ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. దాంతో ఈ ఇద్దరు రెండుళ్లుగా విడిగా ఉంటున్నారు. డిసెంబర్ 18న ముంబైలోని అంబోలి పోలీస్ స్టేషన్‌లో గృహ హింస కేసు పెట్టింది. తన అత్తా మామలతో పాటు తన భర్త ప్రశాంత్ సోదరి అయిన హీరోయిన్ హన్సికలు తమ వైవాహిక జీవితంలో జోక్యం చేస్తుకోవడంతో గొడవలు మొదలయ్యాయని. హన్సిక ఫ్యామిలీ మొత్తం మీద కేసు నమోదు చేసింది ముస్కాన్. తనను తనను మానసికంగా, శారీరకంగా చాలా రోజులు హింసించారని తన ఫిర్యాదులో పేర్కొంది హన్సిక. ఇక దేశముదురు సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది హన్సిక మోత్వాని. ఆతర్వాత తెలుగులో పలు సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తెలుగు, తమిళ్ భాషల్లో సినిమాలు చేసి మెప్పించింది. ఇక ఇప్పుడు టీవీ షోకు జడ్జ్ గా వ్యవహరిస్తోంది. ఇటీవలే తమిళ్ లో లేడీ ఓరియేంటేడ్ సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ సాధించలేకపోయింది హన్సిక.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613